నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 07 సెప్టెంబర్ 2024 | పేజీలు 8

# లక్ష మందికి ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యం

## కలెక్టర్ ఓ.ఆనంద్



**ఏఎస్‌పేట, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రతిరోజూ లక్ష మందికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఉదయం సంగం, ఏఎస్ పేట మండలాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత సంగం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న కాలవ తవ్వకం పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఏఎస్పేట మండలం జమ్మవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను -మిగతా 2లో

### గణేష్ నిమజ్జన ఏర్పాట్లను

వివరాలు 02లో

## పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్

గణేష్ నిమజ్జన ఏర్పాట్లతో పాటు వాహనాల రాకపోకల నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పలు ప్రాంతాలను పరిశీలించారు.



### అనుమతుల్లేకుండానే..

# పూడికతీత పనులు

**చోద్యం చూస్తున్న అధికారులు – అవినీతికి సిద్ధమైన కూటమి నాయకులు**



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** విడవలూరు మండలంలోని ఊటుకూరు గ్రామం నుంచి సముద్రంలోకి వెళ్లే డ్రైన్ కాలువకు ఎలాంటి అనుమతులు లేకుండానే కూటమి నాయకులు ఇష్టానుసారంగా పూడిక తీత పనులు చేపడుతున్నారు. స్థానికంగా ఉన్న కూటమి నాయకులు అనుమతులు తీసుకోకుండానే దాదాపు నాలుగు భారీ యంత్రాల సహాయంతో పూడికతీత పనులను చేపట్టారు. సంబంధిత శాఖ అధికారుల అనుమతులు లేకుండానే వారికి సమాచారం ఇవ్వకుండానే కూటమి నాయకులు ఇష్టానుసారంగా పూడికతీత పనులు చేపట్టడంతో కాలువ ఆయకట్టుకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పూడిక తీత పనులు చేపట్టి రానున్న కాలంలో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని జేబులు నింపుకునేందుకు కూటమి నాయకులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అవినీతి రహిత కోవూరుగా తీర్చిదిద్దాలనుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కూటమి నాయకులే అడ్డుపడుతున్నారు. ఈ పూడికతీత పనుల వల్ల భారీ అవినీతి పాల్పడేందుకు కూటమి నాయకులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే సంబంధిత అధికారులకు -మిగతా 2లో







### ప్రణాళికాబద్ధంగా

## వినాయక నిమజ్జన ఏర్పాట్లు

**కమిషనర్ సూర్యతేజ**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వినాయక చవితి పండుగ సందర్భంగా నగర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కార్పొరేషన్ ఆధ్వర్యంలో -మిగతా 2లో









# వరద బాధితుల సహాయార్థం కోటంరెడ్డి దంపతుల విరాళం

- సీఎం చంద్రబాబుకు 10 లక్షల చెక్కు అందజేత
- వరద బాధితుల కోసం పాతికేళ్ల యువకుడిలా పనిచేస్తున్నారంటూ కోటంరెడ్డి కితాబు..



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించే చంద్రబాబు నాయుడు.. వరద బాధితులకు అండగా ఉండేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్‌బీకే సేవా సమితి కన్వీనర్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆయన పిలుపు మేరకు తనవంతు బాధ్యతగా.. ఎన్‌బీకే సేవా సమితి తరపున పది లక్షల రూపాయల ఆర్థిక సాయం చేసినట్లు ఆయన వెల్లడించారు. విజయవాడలోని కలెక్టరేట్లో చంద్రబాబును కలిసి.. కోటంరెడ్డి, ఆయన సతీమణి సంధ్యారెడ్డి పది లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారిద్దరిని అభినందించారు. మీలాగే అందరూ ముందుకొచ్చి వరద బాధితులను ఆదుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీ ఆలోచన అందరినీ స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రశంసించారు. పాతికేళ్ల యువకుడిలా.. మీరు వరద బాధితులకు చేస్తున్న సేవే తమకు స్ఫూర్తి అని కోటంరెడ్డి చంద్రబాబు దగ్గర వ్యాఖ్యానించారు. అనంతరం కోటంరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హుదూద్ లాంటి భారీ విపత్తునే చంద్రబాబు హ్యాండిల్ చేశారని, విజయవాడ వరదలను కూడా సమర్థవంతంగా ఎదుర్కోవడంతోపాటు.. ప్రజలకు అండగా నిలిచారన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న బురద రాజకీయాన్ని విజయవాడ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, వెళ్లిన ప్రతిచోటా ప్రజల నుంచి నిరసనలు ఎదురవుతున్నాయని కోటంరెడ్డి మండిపడ్డారు. బాలయ్య సేవా సమితి ఆధ్వర్యంలో గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశా మని, ఇప్పుడు పది లక్షల చెక్కును వరద బాధితుల సహాయార్థం అందించామని పేర్కొన్నారు.

# ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని అనుముసముద్రం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనుము సముద్రం పరిధిలోని మొత్తం 5 అంగనవాడీ కేంద్రాల సంబంధించి ఈ మాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు సీడీపీఓ సునీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం ఎలా తీసుకోవాలి, ఎలా ఉపయోగించుకోవాలి, తదితర విషయాలపై వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కస్తూరి, విజయలక్ష్మి, తెల్లపాడు అనుమసముద్రం అంగన్వాడీ కార్యకర్తలు ఎంరాధా, సిహెచ్ రుతమ్మ, షేక్ జరింతాజ్, పుష్పకళా, ప్రసన్న, పద్మావతి, నవనీత, హెల్పర్లు, తల్లులు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రణాళికాబద్ధంగా వినాయక నిమజ్జన ఏర్పాట్లు

*(మొదటి పేజీ తరువాయి)*

ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని నిమజ్జనం ఘాట్, పెన్నా బ్యారేజీ తిక్కన పార్కు వద్ద నిమజ్జనం కోసం రూ.154.92 లక్షలతో పనులను చేస్తున్నామని ప్రకటించారు. పండుగ అనంతరం నిమజ్జనం కార్యక్రమం కోసం ఘాట్ వద్ద భారీ క్రేన్‌లు, మర బోట్లు, గజ ఈతగాళ్లు, బారికేడ్ల ఏర్పాటు, రాత్రి పూట లైటింగ్, సి.సి కెమెరాల నిఘా పర్యవేక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ నిమిత్తం మైక్ అనౌన్స్‌మెంట్ తదితర వసతులు తేదీ ఈనెల 7 నుంచి 11 తేదీ వరకు ఐదు రోజులపాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను కేటాయించి ట్రాక్టర్లు, చెత్త సేకరణ ఆటోలతో ఘాట్ ప్రాంగణం నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించనున్నామని పేర్కొన్నారు. నిమజ్జనం జరిగే చెరువు ప్రాంతంలో ఆకులు, పూలు, ఇతర వ్యర్థాలు వేయకుండా భక్తులందరూ సహకరించాలని కమిషనర్ కోరారు. ఘాట్ ప్రాంగణం వద్ద అన్ని రక్షణా చర్యలతో పాటు, ఘాట్‌కు వచ్చే మార్గాల్లో భక్తులకోసం మంచినీటి సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసే నిమజ్జన విగ్రహాలను ప్రణాళికాబద్ధంగా ఘాట్ ప్రాంతానికి తీసుకొచ్చేలా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. విగ్రహాలతో నిమజ్జనానికి వచ్చే భక్తులు మార్గ మధ్యంలోని విద్యుత్ తీగలు వాహనాలకు తగలకుండా జాగ్రత్తలు, బాణాసంచా కాల్చినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూ రావాలని సూచించారు. నిమజ్జనం ఊరేగింపులో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిమ నిమజ్జనం జరుగు ప్రక్రియలో క్రేన్ తో పాటు ఘాట్ చెరువులోకి దిగే భక్తులు అప్రమత్తంగా ఉండాలని, చిన్న పిల్లలు చెరువు ప్రాంతం వద్దకు రాకుండా జాగ్రత్తలు వహించాలని కమిషనర్ సూచించారు. నగర కూడళ్లలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు ముందస్తు అనుమతులు తీసుకుని ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## లక్ష మందికి ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యం

*(మొదటి పేజీ తరువాయి)*

కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో కలెక్టర్ ప్రత్యేకంగా మమేకమయ్యారు. వారు చేస్తున్న పని వివరాలు, ఎన్ని రోజుల నుంచి పనికి వస్తున్నారు, కూలి డబ్బులు గిట్టుబాటు అవుతున్నాయా.. పనికి వచ్చిన అందరికీ పని కల్పిస్తున్నారా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ కూడా ప్రభుత్వం నిర్దేశించిన రూ 300 కూలి అందుకునేలా పనులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిరోజు 60 వేల మందికి పైగా కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారని, ఈ సంఖ్యను లక్ష వరకు తీసుకెళ్లేందుకు లక్ష్యంగా పెట్టుకుని ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ చెప్పారు. గ్రామాలకు అవసరమైన చెరువులు, కాలువల అభివృద్ధి పనులు, పొలాల్లోకి బాటలు, గ్రావెల్ రోడ్లు, హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులు గుర్తించి ఉపాధి హామీ కింద చేపడుతున్నట్లు చెప్పారు. ఇంకా గ్రామాలకు అవసరమైన ఈ పనులు ఏమైనా ఉంటే గుర్తించాలని గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. గ్రామాలకు



అవసరమైన ఈ అభివృద్ధి పనులను ఉపాధి హామీ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ దృష్టికి తీసుకొస్తే ఆ పనులను వెంటనే మొదలు పెట్టేందుకు అనుమతులు ఇస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్, ఎంపీడీవోలు అప్పాజీ, శ్రీనివాసరావు, తహసిల్దార్లు సోమ్లా నాయక్, శ్రీరామకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ




**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** గణేష్ నిమజ్జన ఏర్పాట్లతోపాటు వాహనాల రాకపోకల నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఇరుకలల పరమేశ్వరి దేవస్థానం, పుట్ట ఎస్టేట్ వద్ద ట్రాఫిక్ డైవర్సన్ పాయింట్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు వినాయక చవిత పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ పర్యావరణం పరిరక్షించేలా మట్టితో చేసిన గణపతి ప్రతిమలను ఉపయోగించి, భక్తి శ్రద్ధలతో, ప్రశాంతంగా, ఆనందంగా, నిబంధనలకు లోబడి వినాయక చవితి పండుగను నిర్వహించుకోవాలన్నారు. వినాయక చవితి పర్వదినం, విగ్రహ ప్రతిష్టాపన, ఊరేగింపు, నిమజ్జనం పూర్తి అయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అందుకు తగ్గట్టుగానే జిల్లా పోలీసుశాఖ, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ డైవర్షన్‌పై త్వరలోనే వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, చిన్నబజార్ సీఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, వెంకటరెడ్డి, కమిటీ నిర్వాహకులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండానే పూడికతీత పనులు

*(మొదటి పేజీ తరువాయి)*

తెలియకుండానే భారీ ఎత్తున పూడికతీత పనులు చేపట్టారు. పనులు పూర్తయిన తర్వాత ప్రతిపాదనలు పంపించేందుకు తద్వారా అవినీతికి పాల్పడేందుకు కూటమి నేతల సిద్ధమైనట్లు తెలుస్తుంది. పూడికతీత పనుల వల్ల డ్రైన్ కాలువకు సమీపంలో ఉన్న చిన్నకారు రైతులు తమ పొలాలు దెబ్బతింటాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డ్రైన్ శాఖ డీఈ ఖాన్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. ప్రస్తు తం తమకు తెలియకుండానే పనులు చేస్తున్నారని, పనులు చేస్తున్న నిర్వా హకులు పిలిచి ఆరా తీశామన్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.



## పంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా..



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు మండల కన్వీనర్ పులుగుంట మధుమోహన్‌రెడ్డి జలదంకి పంచాయతీ ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండ రెడ్డి (చిన్న) ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ సహకారంతో జలదంకి మండల కేంద్రమైన జలదంకి పంచాయతీ అభివృద్ధి ధ్యేయంగా పంచాయతీలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న పంచాయతీ ప్రజలకు అదనంగా పైపులైన్ల ద్వారా నీటి సమస్య పరిష్కారం కోసం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు వింత సుబ్బారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె ఫయాజ్, 4వ వార్డు మెంబర్ గోసు ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ మారుబోయిన సుందరయ్య, మండల ఐటీడీపీ కన్వీనర్ ఏగూరి రఘు, ఎస్.కె కాజామియా, ఏగూరి దాసు, సుమన్, నాయకులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సాయం అందించడంలో.. జగన్ పాత్ర శూన్యం

- రిటైనింగ్ వాల్ నిర్మాణ ఘనత తనదేనన్న విష ప్రచారానికే జగన్ పరిమితం అయ్యారు
- 5 ఏళ్ల వైసీపీ హయాంలో బుడమేరు పై చేపట్టిన ఆక్రమణలు, విచ్చలవిడి నిర్మాణాలు వరదలకు కారణం అయ్యాయి..
- జగన్ ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణంను నిర్లక్ష్యం చేసింది
- టీడీపీ పోరాటంతో నిర్మాణాలు పూర్తి అయ్యాయి
- నాటి హుదుద్ అయినా నేటి వరదలైనా.. విపత్తుల నిర్వహణలో చంద్రబాబు దేశానికే రోల్ మోడల్
- అబద్దాన్ని నిర్భయంగా చెప్పడంలో జగన్మోహన్ రెడ్డిని మించిన వ్యక్తి మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విమర్శ



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** వరద బాధితులకు సాయం అందించడంలో జగన్మోహన్‌రెడ్డి పాత్ర శూన్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విమర్శించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణ ఘనత తనదేనన్న విష ప్రచారానికి జగన్ పరిమితం అయ్యాడని ఆరోపించారు. అబద్దాన్ని నిర్భయంగా చెప్పడంలో కాకాని గోవర్ధన్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని మించిపోయారన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీద రవిచంద్ర జగన్మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. వరద బాధితులకు సాయం చేసేందుకు అనుక్షణం శ్రమిస్తున్న కూటమి నేతలు ఒకవైపు ఉంటే, సాయం చేయకపోగా సహాయక చర్యలను విమర్శిస్తూ బురద చల్లే వాళ్లు మరొక వెట్కపు ఉన్నారన్నారు. వరదల్లో సర్వం కోల్పోయినా, పీకల్లోతు నీళ్ళలో మునిగినా వారిలో అణువంత ఆత్మస్థైర్యం కూడా చెక్కుచెదరలేదంటే అందుకు కారణం చంద్రబాబు నాయుడేనన్నారు. 72 గంటల పాటు సమీక్షలు, క్షేత్ర స్థాయి పర్యటనలు, అధికార యంత్రాంగంతో పాటు తెలుగుదేశం పార్టీ, కూటమి శ్రేణులను అప్రమత్తం చేసి బాధితులను ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా శ్రమించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. తాను రిటైనింగ్ వాల్ కట్టబట్టే విజయవాడ మిగిలి ఉందనే జగన్‌రెడ్డి వ్యాఖ్యలు విని ఒక్క విజయవాడే కాదు రాష్ట్రమే నిర్ఘాంతపోతోందన్నారు. బాధితులను ఆదుకోవడం మాని వాల్ దగ్గర నిల్చొని తాను చేయని పనికి సత్కారాలు, సన్మానాలు చేయించుకోవడం ఒక్క జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. కృష్ణా నది వరద రక్షిత గోడలను (ఫేజ్-1 నిర్మాణాలను) తెలుగుదేశం పార్టీ పూర్తి చేస్తే, తదనంతరం అధికారం లోకి వచ్చిన జగన్ రెండేళ్ల వరకు ఒక్క మీటరు నిర్మాణం చేపట్టిన పాపాన పోలేదన్నారు. బుడమేరు కాలువ లో ఆక్రమణలు, మట్టి, ఇసుక, గ్రావెల్ వ్యాపారాలు తప్పితే ఒక లక్ష రూపాయల అభివృద్ధి పనులను చేసినట్టు వైసీపీ నేతలు చూపగలరా ? విమర్శించారు. 2009లో 25 లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తే నియంత్రించారని విషపు వ్రాతలు వ్రాయిస్తున్నారు. కృష్ణా బ్యారేజ్ ఏర్పడ్డాక ఏనాడైనా అంతటి వరద వచ్చిందా?, బుడమేరు కాలువలో 75వేల క్యూసెక్కుల వరదనీరు ను తాము నియంత్రించామని, 50 వేల క్యూసెక్కుల వరదనీరును టిడిపి ప్రభుత్వం నియంత్రించలేకపోతోందని రోత వ్రాతలు వ్రాస్తున్నారన్నారు. అధికార యంత్రాంగం, టీడీపీ శ్రేణులు చేరుకోలేని ప్రాంతాలకు దేశంలోనే మొట్టమొదటిసారిగా డ్రోన్ల ద్వారా ఆహారం పంపిణీ చేపట్టిన దార్శనికుడు చంద్రబాబుని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కొనియాడారన్నారు. వరదలకు కారణం గేట్లు ఎత్తడమే అని ఒకసారి, ఎత్తకపోవడమేనని ఇంకోసారి ఇష్టమొచ్చినట్లు ముఖ్యమంత్రి పై విష ప్రచారం చేస్తున్నారన్నారు. 5 ఏళ్ల పాటు టీడీపీ నేతలను, ప్రతిపక్ష నేతలను వేధించడానికే పోలీసులు పరిమితం అయ్యారు. నేడు అదే పోలీసులు బాధ్యతాయుతంగా వరద బాధితులను, చంటి పిల్లలను కాపాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, తాళ్లపాక అనురాధ, రాజా నాయుడు, పిఎల్ రావు జలదంకి సుధాకర్, షాబీర్ ఖాన్, అమ్ములా, పనబాక భూలక్ష్మి, హరికృష్ణ, హరిబాబు, రియాజ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఏబీసీ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి : వీఎస్‌యూ వైస్ ఛాన్సలర్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని సి.వి. రామన్ సెమినార్ హాల్ నందు శుక్రవారం ఉదయం అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కరరావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు విద్యార్థినీ విద్యార్థులు సంబంధించిన ఏబీసీ లేదా అపార్ ఐడి నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్‌లకు విశ్వవిద్యాలయ ఉపకులపతి సూచించారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలో నాణ్యమైనటువంటి చదువును అందించాలని దాని కొరకు అందరూ నిబద్ధతతో పని చేయాలని సూచించారు. విద్యార్థినీ విద్యార్థులను భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగపడే విద్యను అందించినప్పుడే కళాశాలలో ప్రవేశాలు మెరుగవుతాయని తెలిపారు. గవర్నమెంట్, యూనివర్సిటీ నుంచి విడుదలైన అకాడమిక్ క్యాలెండర్ ప్రకారంగా తరగతుల నిర్వహణ, పరీక్షల నిర్వహణ, ఇతర ప్రోగ్రాములు నిర్వహణ ఉండాలని ఉపకులపతి సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ కె.సునీత, విశ్వవిద్యాలయ డీన్ సీడీసీ కాలేజ్ కౌన్సిల్ డెవలప్మెంట్ డాక్టర్ ఎం.హుస్సేనయ్య, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్. విజయ, కావలి పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య టి.వీరారెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.విద్యా ప్రభాకర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి, సహాయక పరీక్షల నియంత్రణ అధికారి కెవిఎల్ కన్యరావు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మండపాలకు తరలిన గణనాథులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో శనివారం నిర్వహించనున్న వినాయక చవితి వేడుకలకు భక్తులు గణనాథులను ప్రతిష్ట కు ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు ఉదయగిరి పట్టణంలో విగ్రహాలు కొనుగోలు పూజా సామాగ్రి దుకాణాలు వద్ద భక్తులు రద్దీ నెలకొంది ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది భక్తులు విగ్రహాలను ఉదయగిరి పామూరు వింజమూరు కావలి నందిపాడు ప్రాంతాల్లో కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు తరలించారు.

## నలంద కాన్సెప్ట్ స్కూల్లో వినాయక చవితి

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక కోపరేటివ్ కాలనీలో నిర్వహిస్తున్న నలంద కాన్సెప్ట్ పాఠశాల నందు శుక్రవారం వినాయక చవితి సందర్భంగా వినాయక చతుర్థి పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వినాయక చవితి యొక్క విశిష్టతను గురించి పిల్లలకు వివరించారు. విద్యార్థులు అందరూ భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజించారు.



## వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజలందరూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలనే సంకల్పంతో.. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి.. నిరంతరం శ్రమిస్తున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి గణనాథుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, ఎటువంటి విఘ్నాలు లేకుండా ప్రజలందరూ ఆనందంగా జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు

### మాజీ ఎంపీ ఆదాల



**నెల్లూరు (వైద్యం), మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా, రూరల్ నియోజకవర్గం ప్రజలకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పవిత్రమైన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో, సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆదిదేవుడు శ్రీ విఘ్నేశ్వరస్వామిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని రూరల్ వైసీపీఇన్చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల పక్షాన పోరాడే అధిక శక్తిని ఇవ్వాలని, 2029 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అఖండ విజయం సాధించాలని ఆదిదేవుడైన శ్రీ శ్రీ విఘ్నేశ్వరుడును ప్రార్థిస్తున్నానని మాజీ ఎంపీ ఆదాల ప్రకటనలో తెలిపారు.

# చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : సీఐ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా సర్కిల్ పరిధి లోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలంలోని పంచాయతీలలో గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని సిఐ వెంకట్రావు ఎస్సై ఇంద్రసేనా రెడ్డిలు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లు లతో మాట్లాడుతూ.. సింగల్ విడో ద్వారా వినాయక ఉత్సవ కమిటీ వారు ముందుగానే పోలీసు అనుమతి తీసుకోవాలని కోరారు. హెచ్‌టిటిపిఎస్ గణేష్ ఉత్సవ్ నెట్‌కు హాయ్ అని టైప్ చేసిన తరువాత ఒక లింక్ వస్తుందని ఆ లింక్‌పై క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుందన్నారు. ఆ తరువాత అప్లికేషన్ కోసం గూగుల్ ఫారమ్ ఓపెన్ చేసి అందులో ఉన్న కాలమ్స్ పూర్తిచేసి సబ్‌మిట్ చేయాలన్నారు. అనంతరం పోలీసులు విచారణ జరిపి సింగిల్ విండో పద్ధతి ద్వారా పర్మిషన్ మంజూరావుతుందన్నారు. డౌన్లోడు చేసుకున్న నో అబ్జక్షన్ సర్టిఫికేటు (ఎన్.ఓ.సి), పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను లేమినేషను చేసి, ఉత్సవ మండపంలో తనిఖీలు చేపట్టేందుకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మండల వ్యాప్తంగా



ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. నిర్వాహకులు రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం ఉపయోగించకూడదని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే లౌడ్ స్పీకర్లను వినియోగించుకోవాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. ఊరేగింపుల్లో బాణసంచా ఉపయోగించరాదని, డీజే శబ్దాలు, అశ్లీల డాన్సులు నిరోధించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పోలీస్ శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కనీసం ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కమిటీగా ఏర్పడి వారి పూర్తి వివరాలను పోలీస్ స్టేషనుకు అందజేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో వేడుకలు చేసుకునే వారు తప్పనిసరిగా ఆయా విభాగపు అధికారులు, సంస్థల యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, మార్గం, నిమజ్జనానికి వినియోగించే వాహనం వివరాలను విధిగా తెలియజేయాలన్నారు. నిమజ్జనానికి మంచి కండీషన్‌లో ఉండే వాహనం, అనుభవం కలిగిన డ్రైవరును ఉపయోగించాలన్నారు. ఆయా విగ్రహ మండపాల వద్ద నిరంతరం కాపలా, తాత్కాలిక సీసీ కెమెరాలు వంటివి కమిటీలు సొంతంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండపాలు, విగ్రహాలు రోడ్డుపై ఉండ రాదని, బ్యానర్లు, ఫ్లెక్సీలతో ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపు సమయంలో పోలీస్ అనుమతి లేకుండా వేషధారణలు, డీజే వంటివి నిషేధమన్నారు. అనుచిత, అసభ్య ప్రదర్శనలు లేకుండా ఉత్సవ కమిటీ నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు.

# డీబీఎస్ కళాశాలలో రాష్ట్రస్థాయి సైడ్ వాలీబాల్ పోటీలు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి డీబీఎస్ కళాశాలలో బుధవారం వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలను ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీ ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు 9 జిల్లాల నుండి మొత్తం 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలో ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 20 నుంచి 22 తేదీల వరకు మహారాష్ట్ర షిరిడి ఆత్మమాలిక్ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో శ్రీ ఏ సైడ్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతాయని, ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టునుంచి ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని, అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి సురేష్ రెడ్డి, మురళి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ముందుగా డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దాంశెట్టి సుధీర్ నాయుడు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు, కొక్కిరాల సంజీవ్ కుమార్ కాపు సంఘం అధ్యక్షులు ప్రకాశం జిల్లా పాలెం సురేష్‌బాబు కందుకూరి రాంబాబు ముఖ్యఅతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలను నిర్వహించేందుకు 9 జిల్లాలకు సంబంధించిన కోచ్లు పాల్గొంటారని పీడీలు దాసరి శివకుమార్, తెలిపారు. అండర్-14 విభాగానికి జి.భార్గవి. వెంకటరమణ. అండర్-17 విభాగానికి అనిల్, రాధా అండర్-19 విభాగానికి నాగరాజు, దాసరి శివసాగర్కుమార్ ఉండి ఈ పోటీలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ టీం తరపున పాల్గొన్నారు. రెండు స్థానం తిరుపతి. మూడవ స్థానం నెల్లూరు. అండర్-14 గర్ల్స్ ఫస్ట్ ప్లేస్ అనంతపురం. సెకండ్ ప్లేస్ కడప. థర్డ్ ప్లేస్ అన్నమయ్య. అండర్-17 బాయ్స్ ఫస్ట్ ప్లేస్ నెల్లూరు. సెకండ్ ప్లేస్. అన్నమయ్య. థర్డ్ ప్లేస్ ప్రకాశం. అండర్-17 గర్ల్స్ ఫస్ట్ ప్లేస్ కడప. సెకండ్ ప్లేస్ నెల్లూరు. థర్డ్ ప్లేస్ తిరుపతి. అండర్-19 బాయ్స్ ఫస్ట్ ప్లేస్ అనంతపురం. సెకండ్ ప్లేస్ నెల్లూరు. థర్డ్ ప్లేస్ అన్నమయ్య. అండర్- 19 గర్ల్స్ ఫస్ట్ ప్లేస్ కడప. సెకండ్ ప్లేస్ ప్రకాశం. మూడో ప్లేస్ నెల్లూరు. వివరాలను కావలి డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వివరాలను తెలియజేశారు.

# డిప్యూటీ సీఎం ఆదేశాలతో జానీ మాస్టర్ సహాయార్థం



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ వారి కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలో ప్రకృతిఆడినవి లయతాండవం దెబ్బకు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అనేక విధాలుగా పడుతున్న ఇబ్బందుల్ని చూసి వారి కుటుంబ సభ్యులు కలత చెందారు. అనంతరం జానీ మాస్టర్- సుమలత కుటుంబాలకు పైగా నిత్యవసర సరుకులు, ఆహార పొట్లాలు, పంపిణీ చేయడం జరిగింది. జానీ మాస్టర్ ఇక్కడ పరిస్థితులు బట్టి డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు జనసేన పార్టీ నుంచి నాయకులు కార్యకర్తలు వీర మహిళలు వారికి విధంగా సహాయ, సహకారాలు అందించేందుకు మేము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వీర మహిళా విభాగం నుంచి కృష్ణ, పేన్న రీజనల్ కోఆర్డినేటర్ నాగరత్నం అధికార ప్రతినిధి శివపార్వతి, రీజనల్ కోఆర్డినేటర్ రవి, సౌజన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గురుకుల కిషోర్, కావలి వీరమహిళ కందులలక్ష్మీకవిత కావలి నియోజకవర్గం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆలా శ్రీనాథ్,హరి, ప్రశాంత్ గౌడ్, హసీనా, స్థానికులు పాల్గొన్నారు.

కెఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో..

## వినాయక చవితి వేడుకలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కెఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు శుక్రవారం సాయంత్రం ముందస్తు వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. బొజ్జ గణపతిని పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. బ్రాహ్మణులు వేదమంత్రాలు మధ్య ఈ కార్యక్రమాన్ని జరిపినారు. స్కూల్ యాజమాన్యం అయినటువంటి పురిణి ఏడుకొండలు, పద్మావతి దంపతులు సతీసమేతంగా పూజలు చేశారు. భక్తిశ్రద్ధలు ఆచరిస్తూ గణపతి పూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈనేపధ్యంలో విద్యార్థిని విద్యార్థులు గణపతి పాటలు పాడారు. పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వంపై ముస్లిం మైనార్టీలు ఆగ్రహం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వంపై ముత్తుకూరు మండలం ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ చట్టంలో సవరణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలు శుక్రవారం మండల కేంద్రంలో ఆందోళన వ్యక్తం చేస్తూ బస్టాండ్ సెంటర్ నుండి రెవెన్యూ కార్యాలయం వరకు వందలాదిమంది ముస్లిం మైనార్టీ సోదరులు ర్యాలీ చేశారు. ప్ల కార్డులు చేత పట్టుకుని కేంద్ర ప్రభుత్వంపై నిరసన చూపారు. తదుపరి రెవెన్యూ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. తహసిల్దార్‌తో మాట్లాడి విషయం చెప్పారు. ముస్లిం మైనార్టీల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు.

## పునరావాసం నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండాలి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** నేలటూరు గ్రామపంచాయితీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పునరావాసం గృహాల్లో నాణ్యత ఉండాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పునరావాసం ప్రాంతాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ప్రభుత్వ అధికారులతో పాటు కాంట్రాక్టర్ సందీప్ రెడ్డితో ఎమ్మెల్యే చర్చించారు. ఇప్పటివరకు నిర్మాణ పనులు చాలా బాగున్నాయని ఎమ్మెల్యే అన్నారు. నిర్మాణ పనులు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుచించారు. అదేవిధంగా స్థానిక అధికార పార్టీ నాయకులు యానాటి శ్రీనివాసులు రెడ్డితో ఎమ్మెల్యే చర్చించారు. గత ప్రభుత్వంలో పునరావాసం పనులు జాప్యంపై అధికార పార్టీ నాయకులు యానాటి ఎమ్మెల్యేకి తెలియజేశారు. అదేవిధంగా నేలటూరుప్రజలు కాలుష్యంతో బాధలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ మల్లికార్జునరావు, తెలుగు యువత అధ్యక్షుడు ముని రెడ్డి, పార్టీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రావు,దీనయ్య, దాసరి శ్రీనివాసులు, బాబిరెడ్డి, బిజెపి, జనసేన నాయకులు వంశీధర్ రెడ్డి, సురేష్ బాబు, నాయకులు దండు శ్రీనివాసులు, అక్కయ్య గారి ఏడుకొండలు, నేలటూరు గ్రామ కాపులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సహాయం అందించిన పోబ్బ సాయివిటల్

**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల విజయవాడలో జరిగిన వరద ప్రమాదంలో ఎంతోమంది చనిపోయి.. అనేక కుటుంబాలు నీటిలోనే దుర్భర జీవితాన్ని గడుపుతున్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసిన విషయమే. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు విజయవాడలో సహాయక చర్యలలో పాలు పంచుకోవాలని పిలుపుతో కావలి శాసనసభ్యులు గత 4 రోజుల నుండి 17వ డివిజన్ ప్రాంతంలో ప్రజలకు వారికి కావాల్సిన ఆహారము, పాలు, పండ్లు, మంచినీరు నిత్యవసరకులు ఎప్పటికప్పుడు అందిస్తూ అక్కడ పరిస్థితులను తెలుసుకుంటూ, నక్రమంలో కావలి నియోజకవర్గం నుంచి సహాయం అందించాలని కోరగా కావలి పట్టణ జనసేన నాయకులు మరియు ఏరియా వైద్యశాల కమిటీ మెంబర్ పోబ్బసాయివిటల్ విజయవాడ చేరుకొని 350 దుప్పట్లు ఎమ్మెల్యే కావ్య ద్వారా ప్రతి గృహానికి పంపిణీ చేయడం తను చేస్తున్న సేవలు కావలి పట్టణ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పగలనక నిరంతరము ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు



తెలుసుకొని తను వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్న కావ్య కు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు.

# ఘనంగా రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పుట్టినరోజులు వేడుకలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అలాగే మాజీ ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు 54వ పుట్టినరోజు సందర్భంగా కావలి అన్నా క్యాంటీన్ వద్ద వారి అభిమానులు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మన్నవ రవిచంద్ర పాల్గొని అభిమానుల మధ్య భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కావలి తెలుగుదేశం పార్టీకి మలిశెట్టి వెంకటేశ్వర్లు వెన్నుముకగా ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి గెలుపుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేసినట్లు వారు తెలిపారు. అలాగే మొదటి నుంచి కష్టనష్టాలు వచ్చి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతూ, నిత్యము తన కార్యకర్తలకు అండగా ఉంటూ, వారి సమస్యల్లో పాలుపంచుకుంటూ, నిరంతరం కార్యకర్తలు తోడుగా ఉండే మలిశెట్టి వెంకటేశ్వర్లు ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని కోరారు. అలాగే అన్నా క్యాంటీన్లో పేద ప్రజలకు ఉచితంగా భోజనం, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మలిశెట్టి అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి, మూర్తిమత్వం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమసింహపురి విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, తిక్కన పీఠం ఆధ్వర్యంలో 'శ్రీపొట్టి శ్రీరాములు త్యాగనిరతి మూర్తిమత్వం' అనే అంశంపై సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్ విజయ భాస్కర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ రచయిత వ్యక్తిత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రసంగించిన వక్త డాక్టర్ నాగసూరి హరి గోపాల్, పొట్టి శ్రీరాములు బాల్యం, విద్యాభ్యాసం, వివాహం ఆంధ్రరాష్ట్రం కోసం చేసిన బలిదానాలను గుర్తు చేశారు. అనంతరం రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్




వై వెంకటయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.హెచ్. విజయ, తెలుగు శాఖ విభాగాధిపతి మైల త్యాగరాజు, విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానిపల్లి ఘాట్రోడ్డుపై ఓ మలుపు వద్ద రెండు మోటార్ బైక్ లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. జి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కేశవులు, ఓబులప్రసాద్‌లు ఉదయగిరి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, లింగం నేనిపల్లి గ్రామానికి చెందిన నరసింహులు, సాదం శ్రీనివాసులు మోటార్ బైక్ పై పని నిమిత్తం ఉదయగిరికి వసు న్నారు. ఈ తరుణంలో ఘాట్రోడ్డులో ఓ మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆ రెండు బైక్లు



ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కేశవులు, నరసింహులకు తీవ్ర గాయాలు కాగా, ఓబులప్రసాద్, శ్రీనివాసులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేశవులు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం ఆత్మకూరుకు తరలించారు. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## దోమల నివారణకు అధికారులు చర్యలు



**సంగం, మేజర్‌న్యూస్ :** సంఘం మండలం పెరమణలో డెంగు కేసు నమోదు అయినందువలన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణ, పరిశుభ్రత పరిశుభ్రత కొరకు స్ప్రేయింగ్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా మలేరియా అధికారి శ్రీమతి హుస్సేన్ అమ్మ ఈ గ్రామాన్ని సందర్శించారు. డెంగు జ్వరం ఉన్న వ్యక్తి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆ గ్రామ ప్రజలను ఉద్దేశించి పరిసరాల పరిశుభ్రత గురించి ఆరోగ్య విద్య ద్వారా తెలియపరిచారు. నీటి నిలువ లేకుండా ప్రతి శుక్రవారం కూలర్లు నీటి తొట్టెలు శుభ్రం చేసుకోవాలని ఆ గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఆ గ్రామంలో దోమల నివారణకు చేసిన ఏఎల్‌ఓ స్ప్రేయింగ్, పైరిత్రం స్ప్రేయింగ్‌ను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ రెండు సమయాల్లో..

# గణపతి విగ్రహ ప్రతిష్ఠ చేయండి

▶ జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జ్యోతిష శాస్త్రం ప్రకారం నిర్దేశించిన ఆ రెండు సమయాల్లో గణపతి విగ్రహ ప్రతిష్ఠ చేయాలని జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ తెలిపారు. ఈనెల 7వ తేదీన జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతిష్ఠ సమయం వివరాలను ఆయన శుక్రవారం మేజర్ న్యూస్ కు తెలిపారు. ఉదయం 6.58 నిమిషాల నుండి 7.10 నిమిషాల మధ్య, మరియు 10.58 నిమిషాల నుండి 11.10 నిమిషాల మధ్య వినాయక మండపాల్లో గణపతి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జరుపుకోవచ్చని ఆయన వెల్లడించారు. ఈ రెండు సమయాలు చాలా బాగున్నాయని శుభసూచకం అన్నారు. నివాస గృహాల్లో వ్రతం ఆచరించేందుకు ఈ సమయాన్ని పాటించాలన్నారు. వినాయక వ్రతం చేస్తూ అన్ని రకాల పత్రులతో పూజలు చేయాలన్నారు. హిందూ సంప్రదాయపదంగా గణపతికి అందించేటువంటి కుడుములు, ఉండ్రాళ్ళను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకోవాలన్నారు. సంకటహర గణేశ స్తోత్రం చదవాలని జ్యోతిష శిరోమణి తెలిపారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని పూజించాలన్నారు.

## మెగా లోక్‌అదాలత్ను సద్వినియోగం చేసుకోండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 14వ తేదీన నిర్వహించే మెగా లోక్‌అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి సీఐ ఎన్. వెంకట్రావు, ఎస్ఐ కె.ఇంద్రసేనా రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంట పాడు, దుత్తలూరు మండలాల్లో సుమారు 500 కేసులకుగాను రాజీదగ్గ కేసులను 200లను గుర్తించామన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేసి రాజీపడే కేసుల్లో వాదులు, ప్రతివాదులను గుర్తించి అవగాహన కల్పిస్తున్నారు. ఇరువురి అంగీ కారంతో వారు ఆయా పోలీస్ స్టేషన్లను సంప్రదిస్తే రాజీ చేస్తామన్నారు.

# వీఎస్‌యూ మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-4, జనతా ఫౌండేషన్ సంయుక్తంగా ఎకో ఫ్రెండ్లీ మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, ముఖ్యఅతిథిగా విచ్చేసి విశ్వవిద్యాలయ సిబ్బందికి మట్టి వినాయకుడి విగ్రహాలను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రతి ఒక్కరూ వినాయక చవితిని మట్టి విగ్రహాలతోటి పూజించి నిమజ్జనం చేసుకోవడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఇలా మట్టి విగ్రహాలను విశ్వవిద్యాలయంలో స్వయంగా తయారు చేయించి సిబ్బందికి పంపిణీ చేయడానికి సహకరించిన జనతా ఫౌండేషన్ సభ్యులకు మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్-4 బృందాన్ని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాసరి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ బి.సాయినాథ్ యూనివర్సిటీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




# సమాజ విజ్ఞాన ప్రసాదకులు ఉపాధ్యాయులు

- కోలాహలంగా అపుస్మా ఉపాధ్యాయవేడుకలు
- ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు
- అలరించిన సాంస్కృతికప్రదర్శనలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజానికి విజ్ఞానాన్ని అందించే ప్రసాదకులు ఉపాధ్యాయులని, ఉపాధ్యాయులులేనిదే జనాలు భవిష్యత్తు పొందలేరని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం ఆత్మకూరులోని శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో పెద్దఎత్తున అత్యంత కోలాహలంగా ఉపాధ్యాయదినోత్సవ వేడుకలను నిర్వహించారు. అపుస్మా ఆధ్వర్యంలో ప్రవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేసి అట్టహాసంగా ప్రతిఏటా అవార్డుల ప్రధానోత్సవం నిర్వహిస్తుండడం తెల్సిందే. ఈదపా కార్యక్రమాన్ని అపుస్మా ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి అధ్యక్షతన గౌరవాధ్యక్షుడు టీసీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, స్థానిక నిత్యాన్నదాత, సామాజికసేవాప్రదాత, శ్రీ సాంబశివచారిటబుల్‌ట్రస్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి, నెల్లూరు శ్రీకృష్ణచైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ పర్వతరెడ్డి రాణాప్రతాప్, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు స్ఫూర్తి అని, ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం, గురుతర బాధ్యత ఉందన్నారు. ఉపాధ్యాయులు లేకుంటే సమాజంలో ఎవరూ వృద్ధిచెందే పరిస్థితి ఉండబోదన్నారు. ప్రవేటుస్కూల్స్ ఉపాధ్యాయులు అత్యంత శ్రద్ధాసక్తులతో విధులు నిర్వహించి విద్యార్థులకు బోధనగావించి వారిని అత్యంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతుంటారన్నారు. అపుస్మా ప్రవేటుపాఠశాలల ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి కృషిచేస్తుందని, వారిని ప్రోత్సహిస్తుందని వారు పేర్కొన్నారు. కంచి పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తనవంతుగా సమాజానికి అందిస్తున్న వివిద సేవా కార్యక్రమాలతో పాటు ప్రోత్సాహకరంగా 2024-25 విద్యాసంవత్సరంలో అపుస్మా ఆధ్వర్యంలోని 14 పాఠశాలల్లో టెన్త్‌లో ప్రథమ, ద్వితియ, తృతియ స్థానాలు పొందిన విద్యార్థులకు 25వేలు, 15వేలు, 10వేల వంతున అందజేస్తానని, ప్రతి పాఠశాలలో ప్రథములుగా నిలిచేవారికి 5వేలవంతున అందజేస్తానని అందరిక కరతాళధ్వనుల మద్య ప్రకటించారు. పరమేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజిక సేవలను అందరూ కొనియాడారు. అతిథులు జ్యోతిప్రజ్వలన అనంతరం సభ నిర్వహించారు. అనంతరం 14పాఠశాలల నుండి ఉత్తమ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని, ప్రతిభ చూపిన విద్యార్థులను అతిధుల చేతులమీదుగా సన్మానించి ప్రశాంశా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థినీలు, ఉపాధ్యాయినీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా అలరించారు. ఈ కార్యక్రమంలో అపుస్మాజిల్లా కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్తకార్యదర్శి ఈగా భాస్కరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.హెచ్.రమణారెడ్డి, ఆత్మకూరు డివిజన్ కార్యదర్శి మల్లికార్జుననాయుడు, ప్రధానకార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లురెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ కె.వి.శేషారెడ్డి, సాంబశివట్రస్ట్ ప్రతినిధి జయేంద్రప్రసాద్‌రెడ్డి, వివిద పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాసులునాయుడు, చిన్నారెడ్డి, ఖాజావలి, ప్రభాకర్, హరనాథ్‌రెడ్డి, రమేష్‌బాబు, బి.రమేష్, సుధాకర్‌రెడ్డి, రజని, మహబూబ్‌బాషా, దొరస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వందూరుగుంటలో పౌష్టికాహారసదస్సు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని వందూరుగుంట2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. సీడీపీఓ పి.సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈసదస్సు, పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. రత్నమ్మ ప్రసంగిస్తూ పౌష్టికాహారం వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గుల్జార్‌బేగమ్, ఆశాకార్యకర్త సుజాత, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నువ్వురుపాడులో పౌష్టికాహార సదస్సు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని నువ్వురుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. సీడీపీఓ పి.సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈసదస్సు, పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. నాగేశ్వరమ్మ ప్రసంగిస్తూ పౌష్టికాహారం వలన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.పద్మ, డి.విజయలక్ష్మి, ఎం.లక్ష్మినరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పి ఎం.సుభాషిణి, హెల్త్‌అసిస్టెంట్ పి.జిలానీబాషా, ఏఎన్ఎం పద్మ, ఎంఎస్‌కె గౌసియా, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన వీపీఆర్ దంపతులు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీసులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ప్రజలను, కూటమి నాయకులకు, కార్యకర్తలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తలపెట్టే ప్రతి కార్యం బొజ్జ గణపయ్య ఆశీర్వాదంతో విజయవంతం కావాలని, పండుగను కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరారు.

## మాజీ ఎంపీపీ సుబ్బరాజు మృతి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం చిలకల మర్రి గ్రామానికి చెందిన మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు మునగపాటి సుబ్బరాజు శుక్రవారం మృతి చెందారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మునగపాటి మృతి వార్త జిల్లాలోని టీడీపీ నాయకులను సైతం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో అనారోగ్య పరిస్థితులు తీవ్రంగా ఉన్న పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. మృదు స్వభావిగా, ప్రతి ఒక్కరిని నవ్వుతూ పలకరించే సుబ్బరాజు మృతి మండలంలోని ప్రతి పార్టీ నాయకులకు విస్మయానికి గురిచేసింది. సుబ్బరాజు కుటుంబానికి పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# మునగపాటి మృతి టీడీపీకి లోటు

- క్లస్టర్ ఇన్‌చార్జ్ కొప్పాల నరసింహులు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం మాజీ ఎంపీపీ మునగపాటి సుబ్బరాజు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని ఆత్మకూరు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొప్పాల నరసింహులు అన్నారు. శుక్రవారం సుబ్బరాజు మృతి చెందారన్న వార్త టిడిపి పార్టీ శ్రేణులుకే కాక అన్ని పార్టీ నాయకులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు అన్నారు. అనంతసాగరం మండల ఎంపీపీగా మంచి పేరు పొంది ఉన్నారు. సౌమ్యునిగా, అజాత శత్రువునిగా, ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా ఆప్యాయంగా పలకరించే స్వభావి మునగపాటి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన సుబ్బరాజు కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మండల టీడీపీకి తీరని లోటు అని అన్నారు.

## ఉపాధిహామీపనులు పరిశీలించిన ఎండీఓ



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని నబ్బీనగరంలో జరుగుతున్న జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ పి.ఐజాక్‌ప్రవీణ్ పరిశీలించారు. పనులను కొలతల ప్రకారం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన 300రూపాయల వేతనం కూలీలకు లభించేలా చూడాలన్నారు. ఎండతీవ్రత లేకుండా వాతావరణం అనుకూలంగా ఉన్నందున మధ్యాహ్నం 12గంటల వరకు పనులు చేయించాలన్నారు. పనిప్రదేశంలో మేట్లు మస్టర్‌ద్వారా హాజరు నమోదు చేయాలని ఆయన సూచించారు. సాంకేతిక సహాయకులు పనులు పర్యవేక్షిస్తూ కొలతల ప్రకారం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రసహాయకులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నత్త నడకే ఆఫ్రాన్ పనుల కంటే మేలు : సీపీఎం నాయకులు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల ప్రాజెక్టు వద్ద జరుగుతున్న ఆఫ్రాన్ పనులు తీరు, పురోగతిని గమనిస్తే నత్త నడకే మేలనిపిస్తోందని జిల్లా మాజీ రైతు సంఘం కార్యదర్శి చంద్ర రాజగోపాల్ అన్నారు. శుక్రవారం సోమశిల జలాశయాన్ని జిల్లా సిపిఎం, వ్యవసాయ, రైతు సంఘం నాయకులు సందర్శించారు. ప్రాజెక్టు రేడియల్ గేట్ల ముంగిట జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్వహణ, పర్యవేక్షణ, పురోగతిపై పనులను పర్యవేక్షిస్తున్న అధికారుల నుంచి ఆరా తీశారు. అనంతరం విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. నూతన టిడిపి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రాజెక్టుల అభివృద్ధి పనులు ఊపొందుకుంటాయన్న విశ్వాసం ప్రారంభంలో కలిగిందని రాజగోపాల్ అన్నారు. సోమశిల ప్రాజెక్టు ఆఫ్రాన్ పనుల పున ప్రారంభం పై మంత్రులు గుత్తేదారుతో చేసుకున్న ఒప్పందాన్ని ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ,దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు జలాశయాన్ని సందర్శించి 60 రోజుల్లో మిగిలిన పనులను పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించడం జరిగిందన్నారు. సదరు కాంట్రాక్టర్ సైతం పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి శరవేగంగా పూర్తి చేస్తామని మంత్రుల త్రయానికి హామీ ఇచ్చి ఉన్నారన్నారు. ఈనెల 14వ తేదీకి గడువు కాలం పూర్తవుతుందని కనీసం 10శాతం పనులు కూడా పూర్తికాని పరిస్థితి కనిపిస్తోందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ చేత ప్రభుత్వం, అధికారులు పనిని ఒప్పందం మేరకు చేయించుకోలేని దుస్థితిలో ఉండటం దురదృష్టకరమన్నారు. మంగళ పుల్లయ్య మాట్లాడుతూ.. అతి ప్రాధాన్యత కలిగిన డైవర్షన్ కెనాల్ వాల్ నిర్మాణం చేపట్టకుండా ఆఫ్రాన్ ప్రాంతంలోని దెబ్బతిన్న చోట మాస్ కాంక్రీట్ పైనే దృష్టి సారించడం హాస్యాస్పదం అన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంట లక్ష్మీపతి మాట్లాడుతూ.. 2020-21లో వచ్చిన వరదలే మరలా పునరావృతం ఆఫ్రాన్ ప్రాంత పనులు పూర్తికాని దృష్ట్యా విజయవాడ ముంపు పరిస్థితులను పెన్నా తీర ప్రాంత గ్రామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం నాయకులు సోమశిల ప్రాజెక్టు పైకి వెళ్లి జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ, వస్తున్న వరద ఇన్ఫ్లో వివరాలను ప్రాజెక్టు సిబ్బంది నుండి సమాచారం సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముత్యాల గురునాథం, తుళ్లూరు గోపాల్, పొట్టేపాలెం చంద్రమౌళి, అనంతసాగరం మండల సిఐటియు కార్యదర్శి అన్వర్ బాషా, రైతు సంఘం నాయకులు ఉప్పలపాడు మస్తాన్, లక్కు ప్రసాద్, రాచకొండ పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి అభయ హస్తం అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** విజయవాడ వరదల్లో చిక్కుకొని సర్వం కోల్పోయిన వరద బాధితులకు నేనున్నాను అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అభయ హస్తం అందిస్తున్నారని పార్టీ కార్యాలయ కార్యదర్శి మాలేపాటి చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయగిరి నియోజకవర్గం లోని అన్ని మండలాల నుంచి అందరి సహకారంతో పాల ప్యాకెట్లు, విరాళాలు, పాలు, బియ్యం, లాంటి వస్తువులు సేకరించి వరద బాధితులకు స్వయంగా ఎమ్మెల్యే సురేష్ నాయకులతో కలిసి అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వరద బాధితులకు మనో ధైర్యాన్నిస్తూ, ఆపదలో ఉన్నవారికి తన సొంత నిధులతో ఆహారం అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేస్తున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం శ్రేణులు నాయకులు ముందుకు వచ్చి, తమ వంతు సాయం అందించి, వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమైందని, ఆపద సమయంలో ఆదుకోవాల్సిన వైసిపి నాయకులు, తమ స్వార్థ రాజకీయం కోసం అసత్యాలు వల్లిస్తూ తిరుగుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన ప్రతి ఒక్కరూ వైసీపీ నాయకులను నిలదీస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందు ఓ మనిషిలా రాజకీయాలను పక్కనపెట్టి, ఆపదలో ఉన్న వారికి గుప్పెడు అన్నం పెడితే ప్రజలు హర్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు మన్నెం మధు, తిరుమలరెడ్డి, పెంచలనాయుడు, రామకృష్ణారెడ్డి, వంశీ, అశోక్ నాయుడు, తుమ్మల కిరణ్, ముప్వ శ్రీహరి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడే వినాయక చవితి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** వినాయక చవితి పండుగ అంటే ఇష్టం లేని వారు ఉండరు. సాధారణంగా ఏ పండుగైనా ఇంట్లో కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల మధ్య జరుపుకుంటారు. కానీ వినాయక చవితి పండుగ మాత్రం ఊరు వాడా ఒక్కటై కోలాహలంగా జరుపుకునే పండుగ. మరి బొజ్జ గణపయ్య పూజకు ఏమేమి కావాలో ఎలా తెలుస్తుంది? ఇదిగో మీ అందరి కోసమే ఈ పూజ సామగ్రి లిస్ట్. ఈ లిస్ట్ ప్రకారం అన్ని ఉంటే గణపతి పూజకు సర్వం సిద్ధమయినట్టే! వినాయక చవితి పూజ చాలా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాల్సిన పండుగ. ఏ ఒక్క వస్తువు కూడా లోటు లేకుండా అన్నీ ముందుగా సమకూర్చుకోవాలి. ఇలాంటప్పుడే అనిపిస్తుంది కదా ముందుగా లిస్ట్ రాసుకుంటే మంచిదని! ఇది మీ కోసమే ఈ పూజా సామాగ్రి పట్టిక! ఇక పూజకు అన్నీ చకచకా సిద్ధం చేసేసుకుందాం. గణపతి పూజను ఆనందంగా చేసుకుందాం.

**వినాయకచవితి పూజ సామగ్రి :**

పసుపు, కుంకుమ, గంధం, పన్నీరు, పువ్వులు, అరటిపండ్లు, తమలపాకులు, వక్కలు, పాలవెల్లి, పాలవెల్లి అలంకరణ కోసం పండ్లు, మొక్కజొన్న కంకులు, ఉమ్మెత్తకాయ, కొబ్బరికాయ, పసుపు, గణపతి నైవేద్యానికి, బెల్లంముక్క, అక్షింతలు, మామిడాకులు, అరటి పిలకలు, అరటి ఆకులు, దీపారాధన కుందులు, దీపారాధన వత్తులు, ఆవునెయ్యి/నువ్వుల నూనె (దీపారాధనకు), అగర్బత్తీలు, కర్పూరం బిళ్లలు, అగ్గిపెట్టె, ఆచమనం కోసం, పంచపాత్ర, ఉద్ధరిణి, కలశం కోసం చెంబునీళ్లు (అవకాశం ఉంటే గంగా జలం), వినాయకుని ఆసనంపూజ చేసే వారికి ఆసనం, విఘ్నేశ్వరుని ప్రతిమ, వినాయకునికి యజ్ఞోపవీతం, వినాయకునికి వస్త్రం, వినాయకుని పూజ కోసం పత్రి, మాచీపత్రం, బృహతీపత్రం, బిల్వపత్రం (మారేడు దళం), దూర్వారయుగ్మము (గరిక ), దత్తూర పత్రం, బదరీ పత్రం (రేగు ఆకు ) అపామార్గపత్రం, తులసీపత్రం, చూతపత్రం, కరవీరపత్రం, విష్ణుకాంతపత్రం, దాడిమీపత్రం, దేవదారుపత్రం, మరువకపత్రం, సింధువారపత్రం, జాజీపత్రం, గండకీపత్రం, శమీపత్రం, అశ్వత్థపత్రం, అర్జునపత్రం, అర్కపత్రం, మొత్తం 21 రకాల పత్రాలుపూజ పూర్తి అయిన తర్వాత వినాయకుని 21 లేదా 11 లేదా 9 లేదా 5 మీ శక్త్యానుసారం పిండివంటలతో, పప్పు కూర పులుసు పచ్చడి వంటి అనుపానాలతో మహా నైవేద్యం. చివరగా తాంబూలం, దక్షిణ సమర్పించాలి. ఇంకెందుకు ఆలస్యం. ఈ పూజా సామాగ్రి పట్టిక ప్రకారం అన్నీ సిద్ధం చేసుకుందాం. వినాయక చవితి పండుగను ఏ లోటు లేకుండా ఆనందంగా జరుపుకుందాం.

# మండల అభివృద్ధికి కృషి చేయండి

► ఎంపీపీ పద్మజా రెడ్డి



**అనుముసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండల అభివృద్ధికి ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు కలిసి కృషి చేయాలని మండల అధ్యక్షురాలు బి.పద్మజా రెడ్డి కోరారు. శుక్రవారం నాడు మండల కేంద్రం ఏఎస్పేట మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు ప్రసంగిస్తూ పార్టీలు ఏదైనాప్పటికీ మండల అభివృద్ధికి అందరూ కృషిచేసి సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంకు హాజరైన మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, ప్రసంగిస్తూ గ్రామంలో పారిశుధ్యం పైన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్లు, కృషి చేయాలని గ్రామము పరిశుభ్రంగా ఉంచాలని అలాగే చెత్త సంపద కేంద్రాలను అక్టోబర్ రెండో తేదీలోగా అభివృద్ధి పరచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ,ఉపాధి హామీ పథకం, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఇరిగేషన్, గృహ నిర్మాణ, ఐసిడిఎస్, పై పూర్తి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంకు తహసిల్దార్ శ్రీరామకృష్ణ, పిఆర్ఏఐ ఖాదర్ మస్తాన్, అర్డబ్ల్యూసీఐ బ్రహ్మయ్య, ఇరిగేషన్ అధికారులు, మంజుల, నాగ వినుత, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతినే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడదాం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్‌లోని డైకాస్ రోడ్ సెంటర్ కెవిఎస్ పెయింట్ షాప్ నందు సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో కెవిఎస్ పెయింట్స్ వారి సహకారంతో దాదాపు 200మట్టి విగ్రహాలని ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడుదాం మట్టి గణపతిని పూజిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది చిన్న పెద్ద అందరికీ బంధువైన లొంబోదరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని, మీరు తలపెట్టిన పనుల్లో విఘ్నాలు తొలగించాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కెవిఎస్ పెయింట్స్ డైరెక్టర్ కెకెవిఎస్ ధనేష్ నాయుడు, సింహపురి సోషల్ సర్వీస్ ఫౌండర్ షేక్ నైమతుల్లా, కెవిఎస్ పెయింట్స్ అధినేతలు చంద్రమౌళి, మోహన్ సింహపురి సోషల్ సర్వీస్ మేంబర్ పఠాన్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు : జడ్పీటీసీ



**సంగం, మేజర్‌న్యూస్ :** సంగం మండల ప్రజలకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పవిత్రమైన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సంగం మండల జడ్పీటీసీ రావుల లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో, సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆదిదేవుడు శ్రీ విఘ్నేశ్వరస్వామిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని జడ్పీటీసీ రావుల లక్ష్మి పేర్కొన్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల పక్షాన పోరాడే అధిక శక్తిని ఇవ్వాలని, 2029 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అఖండ విజయం సాధించాలని ఆదిదేవుడైన శ్రీ శ్రీ విఘ్నేశ్వరుడును ప్రార్థిస్తున్నానని మాజీ ఎంపీ ఆదాల ప్రకటనలో తెలిపారు.

### చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలు

# వినియోగంలోకి తీసుకురావాలి : కలెక్టర్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలను (ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లు) వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం సంగం, ఏఎస్ పేట మండలాల్లో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలను అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత సంగం గ్రామంలో ఎస్ డబ్ల్యూ పిసి షెడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఏఎస్పేటలో ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న మేజర్ పంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ జనరల్ ఫండ్స్, 15 ఆర్థిక సంఘం నిధులను వెసులుబాటు మేరకు వినియోగించి ఈ షెడ్లలో అవసరమైన మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేసి రైతు సాధికారిక సంస్థ ద్వారా రైతులకు విక్రయించాలని చెప్పారు. ఉపాధి హామీ ప్లాంటేషన్ పనులకు కూడా ఎరువులు వినియోగించాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి కూడా క్రమం తప్పకుండా చెత్తను సేకరించాలని, ప్రధానంగా దుకాణాల నుంచి కూడా చెత్తను రోడ్లపై వేయకుండా సేకరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. చికెన్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, ఈ వ్యర్థాలను దూరంగా భూమిలో పాతిపెట్టేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీల్లో శానిటేషన్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డ్వామా పీడీ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్, ఎంపీడీవోలు అప్పాజీ, శ్రీనివాసరావు, తాసిల్దార్లు సోమ్లా నాయక్, శ్రీరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సచివాలయ సిబ్బంది



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వరద బాధితుల సహాయార్థం అనుమసముద్రంపేట మండల సచివాలయాల సిబ్బంది తమ దాతృత్వం చాటుకున్నారు. శుక్రవారం అనుమసముద్రంపేట పర్యటనకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆనంద్ కు రూ 10 వేల రూపాయలు చెక్కును సచివాలయ ఉద్యోగులు అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడలోని వరద బాధితులకు తమ వంతు సాయం చేసిన సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డ్వామా పీడీ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ జిలాని బాషా తదితరులు ఉన్నారు.

## వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్లు పూర్తి చేసుకోవాలి



### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ మార్చి 2025లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఎఎస్ పేట మండలం తెల్లపాడు గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గృహనిర్మాణ లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇళ్లు త్వరగా పూర్తి చేసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 2025 నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 హౌసింగ్ స్కీం పూర్తవుతుందని, ఈలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని సూచించారు. హౌసింగ్ బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ లబ్ధిదారులకు వివరించారు. హౌసింగ్ లేఅవుట్‌లో విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని, లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా పొదుపు రుణాలు మంజూరు చేయించాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకుంటే సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా వెంటనే కల్పిస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ కూడా తమ సొంతింటి కలను నిజం చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పిడి దయాకర్, తాసిల్దార్ శ్రీరామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బారేజ్‌లకు వైసిపీ పేర్లు పెట్టుకోవడం హాస్యాస్పదం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉండగా 85శాతం పనులు పూర్తి చేసిన సంగం, నెల్లూరు బ్యారేజీలకు వైయస్సార్సీపి అధికారంలోకి వచ్చి పనులు పూర్తికాకుండానే ఆ ప్రాజెక్టులకు ఈ జిల్లాకి ఎటువంటి మేలు చేయని వ్యక్తుల పేర్లు పెట్టుకోవడం ఎంతో హాస్యాస్పదం అని ఆత్మకూర్ టిడిపి పట్టణ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రరెడ్డి విమర్శించారు. అదే విధంగా జగన్మోహన్‌రెడ్డి ఏ ప్రాజెక్టులు కట్టకపోగా తన సొంత ప్రయోజనాల కోసం ఎన్నో ప్రాజెక్టులను పొట్టన పెట్టుకున్నాడని, ప్రస్తుతం విజయవాడ వరదల్లో నేరుగా సీఎం, మంత్రి వర్గం మొత్తం వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎక్కడికక్కడ సహాయక చర్యల్లో పాల్గొంటూ ఉన్నా టీడీపీ మీద వైసీపీ వారు విషం కక్కుతూ ఉన్నారని ప్రజలు వారి వైఖరిని గమనించా రని, కాబట్టే జగన్మోహన్ రెడ్డి 11 స్థానాలకే పరిమితం అయ్యాడని చంద్రారెడ్డి పేర్కొన్నారు.



వినాయక చవితి శుభాకాంక్షలు
వరికుంటపాడు మండలం, విరువూరు గ్రామ ప్రజలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, సహోద్యోగులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు...
విరువూరు గ్రామ సచివాలయం
వరికుంటపాడు మండలం.
ఎస్‌డి. ఇంతియాజ్ – పంచాయితీ సెక్రటరీ
వి.విష్ణువర్ధన్ రెడ్డి – పంచాయితీ సెక్రటరీ
వి.శివ కుమార్ – పంచాయితీ సెక్రటరీ
ఆర్.సరస్వతి – ఎ.ఎన్.ఎం
షేక్ ఖైరున్‌బీ – మహిళా పోలీస్
డి.శారద – అగ్రికల్చర్
ఎస్‌డి. కమిల – పశుసంవర్ధక శాఖ
పి.అంజని కుమార్ – డిజిటల్ అసిస్టెంట్
డి.మల్లికార్జున – వెల్ఫేర్
ఎన్.శ్రీకాంత్ – ఎనర్జీ అసిస్టెంట్
షేక్ సాయి తేజ – ఇంజనీరింగ్ అసిస్టెంట్
పి.ఆదినారాయణ – వి.ఆర్.ఓ


సూర్య www.suryaa.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, రాపూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811


## పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం వస్తుందని అంగన్వాడి సూపర్వైజర్ రమణి అన్నారు. మండలంలోని గాదెలదిన్నె, వరిణి గ్రామాలలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలోని చిన్నారులకు బాలింతలకు గర్భిణీలకు ప్రభుత్వం ద్వారా ప్రతి రోజు పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి మంచి ఆరోగ్యం లభిస్తుందని గుర్తు చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఆకుకూరలు, కోడుగుడ్డు, పాలు తదితర పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జయంతి, మాలిని, అంగన్వాడి కార్యకర్తలు భారతి, చాందిని, జయశ్రీ, శిరీష, శైలజ, లక్ష్మి, వాణి, ప్రసన్నలు పాల్గొన్నారు.